పేదింటి బిడ్డలు.. చదువులో దిట్టలు

- పదిలో విద్యార్థినుల మెరుగైన ఫలితాలు
- గర్ల్స్ హైస్కూల్ నుంచి నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక
- రాజంపేట చరిత్రలో ఇదే ప్రథమం


రాజంపేటలోని గర్ల్స్ హైస్కూల్

రాజంపేట టౌన్ : తల్లిదండ్రులు రెక్కాడిస్తే కాని డొక్కాడని పరిస్థితి ఆ విద్యార్థినులది. అయితేనేం చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు స్థానిక బాలికోన్నత పాఠశాల (గర్ల్స్ హైస్కూల్) విద్యార్థినులు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు టెన్త్‌లో ప్రతిభ కనబరచి అత్యుత్తమ మార్కులు సాధించారు. ఫలితంగా 584 మార్కులు సాధించిన ఎస్.షైబా నూజివీడు ట్రిపుల్ ఐటీలో, 582 మార్కులు సాధించిన ఆర్.ప్రణతి, 579 మార్కులు సాధించిన పి.వహీదాలు ఇడుపులపాయలో, 568 మార్కులు సాధించిన వై.దేవనందిని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వీరి తల్లిదండ్రులంతా నిరుపేదలైనప్పటికీ ఈ విద్యార్థినులు టెన్త్‌లో సత్తాచాటి ఔరా అనిపించారు.

తండ్రి లేకున్నా తల్లి హోటల్‌లో పనిచేస్తూ..

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ప్రణతి కుటుంబంది ఒక విధంగా చెప్పాలంటే సినిమా కష్టాలను తలపిస్తుంది. ఆ విద్యార్థిని తండ్రి చిన్నప్పుడే మృతి చెందడంతో కుటుంబ భారం తల్లి గంగాదేవిపై పడింది. ముగ్గురు ఆడపిల్లలు ఉన్న గంగాదేవి హోటల్‌లో పనిచేస్తూ తన బిడ్డలను అతికష్టం మీద చదివిస్తుంది. వీరిలో మొదటి కుమార్తె బీఈడీ చదవగా, రెండవ కుమార్తె బీటెక్ చదువుతోంది. మూడవ కుమార్తె అయిన ప్రణతి టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైయింది. ప్రస్తుతం ప్రణతి నూజివీడుకు వెళ్లి ట్రిపుల్ ఐటీలో చేరేందుకు ఆమె తల్లికి ఆర్థికంగా చాలా ఇబ్బందికర పరిస్థితి.

సమష్టి కృషి ఫలితం


మా పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలవడమే కాక ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. మంచి ఫలితాల సాధనకు తనతోపాటు మా ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేశారు. అందువల్లే మా పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీటు లభించింది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేందుకు కృషి చేస్తాం.
– జయలక్ష్మి, హెచ్‌ఎం, గర్ల్స్ హైస్కూల్, రాజంపేట

తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే..


మానాన్న బంగారు అంగడిలో పనిచేసే చిరుద్యోగి. అయినప్పటికీ మమ్మల్ని బాగా చదివించాలన్నదే మా అమ్మా, నాన్న కోరిక. వారి ప్రోత్సాహం వల్లే నేను చదువులో బాగా రాణిస్తున్నాను. ఉపాధ్యాయుల ప్రణాళికలు, బోధనల ఫలితంగా టెన్త్‌లో 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్‌గా నిలిచాను. ఇప్పుడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. – షైబా, రాజంపేట

వారి మాటలే నాకు స్ఫూర్తి


మాది చెప్పుకోలేనంత పేదరికం. అమ్మ హోటల్‌లో పాచి పనిచేస్తుంది. అయితే స్కూల్‌లో టీచర్ వాళ్లు బాగా చదువుకుంటేనే పేదరికం నుంచి బయటపడవచ్చని చెబుతుండేవారు. వారి మాటలే నాకు స్ఫూర్తినిచ్చాయి. అమ్మపడే కష్టం నాకు ఎప్పుడు గుర్తుకు వస్తుంది. అందువల్ల బాగా పట్టుదలతో చదివాను. నేను పడ్డ కష్టానికి టెన్త్‌లో మంచి మార్కులు వచ్చి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. – ప్రణతి, రాజంపేట

భరోసా లభించింది


మా నాన్న ప్రైవేట్ వెహికల్ డ్రైవర్. రోజు డ్రైవింగ్‌కు పోతేనే డబ్బులు వస్తాయి. లేకుంటే ఇబ్బందికర పరిస్థితి. నేను బాగా చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే నా కోరిక. ట్రిపుల్ ఐటీలో సీటు రావడం వల్ల ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకునేందుకు భరోసా లభించింది. టెన్త్‌లో మంచి మార్కులు వచ్చేందుకు కారకులైన మా ఉపాధ్యాయులందరికి కృతజ్ఞతలు. – పి.వహీదా, రాజంపేట

చాలా ఆనందంగా ఉంది


మా నాన్న టైలర్. చిన్నపాటి సంపాదన. నాకు ట్రిపుల్ ఐటీలో సీటు రావడం చాలా ఆనందంగా ఉంది. లేకుంటే వేలాది రూపాయిలు ఖర్చు పెట్టి చదువుకోలేక ఇబ్బందులు పడేవాళ్లం. టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విన్నాను. అలాగే ప్రణాళికాబద్ధంగా చదవడంతో టెన్త్‌లో మంచి మార్కులు వచ్చాయి. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల స్ఫూర్తితో ముందుకు పోతాను. – వై.దేవనందిని, రాజంపేట

క్లుప్తంగా

శాకంబరీగా కామాక్షి మాత


శాకంబరీ అలంకారంలో కామాక్షి మాత

పెనగలూరు : మండల కేంద్రంలోని శివాలయంలో ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా కామాక్షి మాత శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి వేదపండితులచే పూజా కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

నందలూరు : విద్యార్థులు చిన్ననాటి నుంచే వినూత్నంగా ఆలోచించే విధానాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు ప్రాజెక్టుల ప్రదర్శన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇతరులతో పోటీపడి బాగా చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఓబుళరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విజయభాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి, జోసెఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయినాథుని మందిరంలో హోమాలు


హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజంపేట : చెయ్యేరు నది ఒడ్డున వెలసిన సద్గురు సాయినాథ మందిరంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, దేవీ ఉపాసకులు, ఆధ్యాత్మిక వేత్త గడియారం ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం ఈ హోమాలను చేస్తున్నామన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించేలా దేవదేవుని ఆశీస్సులు కలిగేలా హోమాలను చేపట్టామన్నారు. కాగా ఈ హోమాలలో వివిధ ప్రాంతాల నుంచి వేదపండితులు పాల్గొన్నారు. భక్తాదులకు తీర్థప్రసాదాలను అందచేశారు. కాగా ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా మందిరంలో రామకృష్ణనందస్వామి నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సౌండ్ సిస్టం వితరణ

రాయచోటి అర్బన్ : పట్టణంలోని అలీమాబాద్ వీధిలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నతపాఠశాలకు దాతలు శుక్రవారం సౌండ్ సిస్టంను వితరణ చేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి, ఇంగ్లిష్ టీచర్ శ్రీనివాసులు ఇరువురు కలసి రూ. 20వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను పాఠశాలకు ఉచితంగా అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాబీర్, ఉపాధ్యాయులు ఇలియాస్, మహమ్మద్‌బాషా, జయన్న, జగదీశ్వరాచారి, అబ్దుల్ రహీం, ఖాన్, దాన్‌బాషా, రహంతుల్లా, నరసరాజు, రాజబాబు తదితరులు వారికి శాలువా కప్పి సన్మానించారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారతులతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

నూతన నియామకం

గాలివీడు : వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షులుగా మండల వాసి బండి వెంకటసాయి పరుసురాంను నియమిస్తూ రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఇచ్చిన ఇటువంటి బాధ్యతను జాతి అభ్యున్నతికి శక్తిమేర కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మోహన్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, అధికార ప్రతినిధి శివప్రసాద్‌లకు కృతజ్ఞతలను తెలియజేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పారాజుపేటలో ఆదివారం స్థానిక ఉప సర్పంచ్ ముస్తాక్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ వారిచే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు స్థానిక రామాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముస్తాక్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేవాలయాలను పరిరక్షించాలి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని హిందూ దేవాలయాలను, ఆస్తులను పరిరక్షించాలని బీజేపీ సీనియర్ నాయకులు కె.కృష్ణ, కె.జయచంద్ర నాయుడులు కోరారు. దేవాదాయశాఖ భూములు, ఆస్తులపై సమగ్ర విచారణ జరిపి ఒక ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన వారు ఎంతటివారైన వారిని చర్యలు తీసుకునేలా చూడాలన్నారు.

వసతి గృహాల్లో శుభ్రత పాటించండి

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు, తహసీల్దారు మురాషావలి, ఎంఈఓ–2 అరుణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల హాజరు రికార్డును, వంటగదిని, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. అలాగే పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టళ్ల వార్డెన్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ నరసింహులు, ఇంజనీరింగ్ అసిస్టెంటు ప్రజ్ఞ, హాస్టల్ వార్డన్ శంకరయ్య తదిరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సిద్దవటం : అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేశారు. శుక్రవారం పెన్నానదిలోకి వాహనాలు వెళ్లకుండా ఆయా గ్రామాల రహదారుల్లో జేసీబీతో గోతులు తీసినట్లు సిద్దవటం ఎస్‌ఈబీ సీఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దేగనవాండ్లపల్లె, మూలపల్లె, ఎస్.రాజంపేట, టక్కోలు గ్రామా సమీపంలో ఉన్న పెన్నానది నుంచి రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని నదిలోకి వాహనాలను వెళ్లనీయకుండా జేసీబీతో గోతులు తీయించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీఎస్‌ఐ రవిబాబు, వీఆర్‌వోలు చంద్ర, చెన్నకేశవులు, వీఆర్‌ఏ రమణ, ఎస్‌ఈబీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పునరావృతం కాకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునాథరెడ్డి, పక్కనే ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి ఒక మండల సమావేశంలో వచ్చిన సమస్యను తిరిగి మండల సమావేశం నాటికి ఆ సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించేలా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తీసుకువచ్చినటువంటి సమస్యలను మండల అధికారులు పరిష్కరించలేని స్థితిలో ఉన్నప్పుడు ఆ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి, మంత్రుల దృష్టికి, ముఖ్యమంత్రి స్థాయి వరకు తీసుకువెళ్లి అయినా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర సమస్యలపై అసెంబ్లీ సమావేశాలు ఎంత ముఖ్యమో మండలస్థాయిలో మండల సమావేశం కూడా అంతే ముఖ్యమని ప్రజా ప్రతినిధులు ప్రతి సమావేశానికి ముందు గ్రామాల్లోని సమస్యలను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్ మాట్లాడుతూ గొల్లపల్లి ఉర్దూ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం కోసం గత మూడు సంవత్సరాలుగా నిధులు మంజూరు కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వేడి నీటి కోసం హీటర్లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ హరిత కోరారు. దీంతో మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధులతో కానీ లేదంటే తన సొంత నిధులతోనైనా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు విద్య, వైద్య, వ్యవసాయ, ఉపాధి, రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు

సర్వసభ్య సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హాజరైన ఎంపీపీ సుధ

చిన్నమండెం : అధికారులు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోని చిన్నమండెం మండలంలో అభివృద్ధి చేయడానికి అందరూ సహకరించాలన్నారు. అధికారులు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అధికారులకు సమస్యలుంటే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్ లీకేజీ ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ బస్సులు సకాలంలో నడపాలని బస్టాండు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించే బాధ్యత అధికారులదేనని తెలియజేశారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా డీఎస్సీ, దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు, డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తామన్నారు. హౌసింగ్ అధికారులు ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని, ప్రస్తుతం వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీపీ సుధామాధురి తాగునీటి సమస్య, చిన్నమండెం ఆర్టీసీ బస్టాండు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దిగువగొట్టివీడు భూ సమస్యలతో రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి మంత్రి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎంపీపీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఎంపీపీ సుధామాధురి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఆనంద్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని జమాలుల్లా ఈద్గాలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం రొట్టెల పండుగ సందర్భంగా ఆయన స్థానిక మైనార్టీ నాయకులతో కలసి ఈ పూజలు నిర్వహించారు. ఈద్గాలో దర్గా మౌళి సాహెబ్ అధ్వర్యంలో జమాలుల్లా బాబా సమాధిపై పూలచాదర్ కప్పి ప్రార్థనలు నిర్వహించారు.

అక్రమణ తొలిగేదెప్పుడు.. సమస్య పరిష్కారమయ్యేదెన్నడు?


అక్రమణలో ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న సర్వేయర్

రాజంపేట రూరల్ : తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని మండలంలోని ఊటుకూరు పంచాయతీలోని రైతులు కోరుతున్నారు. శుక్రవారం ఊటుకూరు పంచాయతీలోని సర్వే నెంబరు 552లో ఉన్న వంక పొరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు సందర్శించారు. మండల సర్వేయర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన భూమి ఇరిగేషన్ శాఖకు సంబంధించిందని ఆ శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చి రైతుల సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. స్థానిక రైతులు నంద్యాల మణి, మద్నా హరి, కసిరెడ్డి సునీల్‌రెడ్డి, వెలుగు శ్రీను, చొడవరం సుబ్బరామయ్య, ధర్మిశెట్టి చంద్రశేఖర్, చొడవరం చిన్నయ్య, లోకయ్య మాట్లాడుతూ సర్వే నం.552లో దేజర్ల వాసుదేవరాజు కొంతమేర ఆక్రమించుకోవడంతో తాము పొలాల్లోకి వెళ్లేందుకు రహదారిని నిర్మించుకోలేక పోతున్నామన్నారు. తమ పొలాల్లోకి దారి వేయాలని అధికారులకు విన్నవించిన స్పందించడం లేదన్నారు. ఈ విషయమై 2022లో హైకోర్టుకు వెళ్లి తమకు అనుకూలంగా దారి నిర్మాణానికి ఆదేశాలు తెచ్చుకున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రైతు వాసుదేవరాజు స్థలం ఖాళీ చేసేందుకు విముఖత చూపుతుండటంతో అధికారులు పొలాల్లోకి వెళ్లేందుకు దారి వెడల్పును చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆక్రమణను తొలగిస్తే మేమే (రైతులు) తమ పొలాలకు దారిని వెడల్పు చేసుకుంటామని చెప్పారు. ఉన్నతాధికారులు, కోర్టు ఆదేశాలను పరిగణించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని తమ పొలాల్లోకి వెళ్లేందుకు దారి వెడల్పు చేసుకునేందుకు సహకరించాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు చైర్మన్ ఫయాజ్ బాషా అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. కౌన్సిలర్ ఆసిఫ్ అలీఖాన్ మృతికి సంతాప తీర్మానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పద్మశాలీల సమావేశం నేడు

పుల్లంపేట : నేడు శనివారం ఎస్‌బీవీడీ సభా ప్రాంగణంలో రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాలకు సంబంధించిన పద్మశాలీల సమావేశం నిర్వహించనున్నట్లు పద్మశాలీ సంఘం అధ్యక్షులు దొంతు శివయ్య తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సిద్దవటం : విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీరాములు సూచించారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు – భద్రత చర్యలపై అవగాహన కల్పించారు.

'అన్యమత ప్రచారంపై పోరాటం ఆగదు'

రైల్వేకోడూరు అర్బన్ : అన్యమత ప్రచారాలు నిర్వహించేవారిపై పోరాటాలు ఆగవని శుక్రవారం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. అలాగే బుడుగుంటపల్లి గ్రామ పరిధిలో విద్యానగర్ ప్రాంతంలో అన్యమత ప్రచారం చేసిన ప్రభుత్వ ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ బాబు, తహసీల్దార్లకు వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దరిసా వెంకటరెడ్డి, సుగవాసి మల్లికార్జున, దశరథరామయ్య, శ్రీనివాసులు, పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, శివయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

సుండుపల్లి : గత కొన్ని రోజులుగా అగ్రహారం ఆంజనేయస్వామి గుట్ట వెనుక భాగంలో ఉండే కాల్వ కింద మడుగు వద్ద రాత్రిపూట అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని బీజేపీ మండల నాయకులు అన్నారు. దీని వలన అన్నదాతలకు ఇబ్బందికరంగా ఉందని వారు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను వరి మళ్లకు, చేనులకు అనుకొని ఎత్తడం వలన వ్యవసాయ బోర్లలో నీరు తగ్గి రైతులకు నష్టం కల్గుతుందని, రాత్రిపూట జరిగే ఈ అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని తహసీల్దార్, ఎస్‌ఐలకు వినతిపత్రాన్ని ఇచ్చారు.

అవగాహనతోనే డెంగీ నివారణ సాధ్యం


సుండుపల్లి: అవగాహన కార్యక్రమానికి హాజరైన అధికారులు

సుండుపల్లి : సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచించారు. శుక్రవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సుండుపల్లెలో డెంగీ లక్షణాలు, చికిత్స గురించి కేజీబీవీ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. పాల్గొన్న సబ్ యూనిట్ అధికారులు వై.ప్రసాద్ యాదవ్, ఎస్.జయరామయ్య, డి.రమణలు మాట్లాడుతూ డెంగీ జ్వరం ఏడీస్ దోమ ద్వారా వ్యాపిస్తుందన్నారు. డెంగీ లక్షణాలను వివరించి, ఈ లక్షణాలుంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలన్నారు. దీనిపై నిర్లక్ష్యం చేస్తే రక్త కణాలు తగ్గి డెంగీ షాక్ సిండ్రోమ్ వచ్చి సీరియస్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల సహకారంతో డెంగీను నివారించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం స్టాఫ్ డయేరియా, హ్యాండ్ వాష్‌పై సూపర్‌వైజర్ రమణ సుండుపల్లె కేజీబీవీ స్కూల్‌లో అవగాహన కల్పించారు. సుండుపల్లి, బీజీ రాచపల్లి, జీకే రాచపల్లిలలో కేజీబీవీ స్కూల్, ట్రైబల్ హాస్టల్, బీసీ, ఎస్సీ హాస్టల్‌లో మాలతియాన్ స్ప్రేయింగ్ చేశారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని పి. కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎసేలో విద్యార్థులకు వైద్యాధికారి రంగలక్ష్మి అధ్వర్యంలో శుక్రవారం డెంగీ జ్వరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి రంగలక్ష్మి మాట్లాడుతూ డయేరియా నుంచి పూర్తిగా రక్షింపబడాలంటే వ్యక్తి గత పరిశుభ్రతను, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. డెంగ్యూ బారిన పడకుండా ఉండాలంటే దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వి. సుబ్బరాయుడు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు అభివృద్ధి చెందుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే కొంతవరకు వ్యాధి బారిన పడకుండా ఉండచ్చన్నారు. డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొనలను తుంచి నాటాలి

సిద్దవటం : రైతులు వరి నాట్లు నాటేటప్పుడు కూలీలతో వరి కొనలు తుంచి నాటాలని, అలా నాటితే కాండం తొలుచు పురుగును నివారించవచ్చునని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండలంలోని మాచుపల్లె రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాండము తొలచు పురుగు గుడ్లు నారు కొనలపై పెడుతుందని, దీంతో కొనలను తుంచి వాటిని భూమిలో తొక్కేయాలన్నారు. అలాగే హిస్పా అనే పురుగు ఆశించిందని దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరా విస్తీర్ణానికి 10 కిలోలు చొప్పున పలుచగా పైరులో నీరు ఉంచి వేసుకోవాలన్నారు. అలాగే పంట లేత వయస్సులో రసం పీల్చు పురుగు నివారణకు వేపగింజల ద్రావణం 5శాతం పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు. రైతు సేవా కేంద్రం సహాయకులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కేంద్రం సహాయకులు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్‌పీలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆలయాలు ముస్తాబు


రైల్వేకోడూరు అర్బన్ ముస్తాబైన సాయినాథుని ఆలయం

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఎదురుగా ఉన్న శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు అవులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు రాత్రి సుధా ఆర్కెస్ట్రా వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 21న గురుపౌర్ణమి పురస్కరించుకొని బొజ్జవారిపల్లి, బుడుగుంటపల్లి, కోడూరు గ్రామాలలో ఉన్న సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు శుక్రవారమే ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక పందిళ్లు, అన్నదానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురుపౌర్ణమి ఆదివారం రావడంతో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

పెనగలూరు : ఈనెల 21న గురుపౌర్ణమి మహోత్సవానికి పెనగలూరులోని సాయిబాబా ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగనున్నట్లు ఆలయ నిర్వాహకులు పసుపులేటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కె.పుల్లయ్య జ్ఞాపకార్థం కె.ఆదినారాయణ, వెంకటరత్నమ్మ దంపతులు భక్తులకు కేసరి ప్రసాదం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

రాయచోటి అర్బన్ : పట్టణంలో పలు వీధులలో పెండింగ్‌లో ఉన్న పైపులైన్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు రాహుల్‌రెడ్డిలు అధికారులను కోరారు. శుక్రవారం కమిషనర్, రాహుల్‌రెడ్డిలు పట్టణ పరిధిలోని 16వ వార్డు పరిధిలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. పైపులైన్ లేని వీధులలో త్వరితగతిన నిర్మాణ పనులను చేపట్టి పూర్తిచేసి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలంటూ కోరారు.

అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీలకు శాశ్వత తాగునీటి వసతి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జునతోపాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారాన్ని అందించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మిచాంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్ బాబుకు వ్యవసాయ కార్మిక సంఘం తరఫున ఉపాధ్యక్షుడు నరసయ్య వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో చెప్పిన ప్రకారం రైతు ఖాతాలలో రూ. 20 వేలు పెట్టుబడి సాయాన్ని జమ చేయాలన్నారు. అలాగే మండలంలో ఉన్న ఉపాధి కార్మికులకు గత తొమ్మిది వారాలుగా కూలీ వేతనాలు పడలేదని, వారికి కూడా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.